

# రెండు వందలు

మల్లాది
వెంకటకృష్ణమూర్తి




**లేడీస్** హాస్టల్లో నమ్రత విలాసిని ఒకే గదిలో ఉంటున్నారు. నమ్రత ఎం. ఎ. ఫస్టియర్. విలాసిని ఎం. ఏ. రెండో సంవత్సరం. నమ్రతకు ఓ సోమవారం రెండు వందల రూపాయలు అవసరం వచ్చాయి.

తన రూమ్ మేట్ విలాసినిని, కొద్దిగా మొహమాటపడుతూనే అడిగింది ఓ రెండు వందలుంటే సర్దమని, శుక్రవారం ఇచ్చేస్తానని.

విలాసిని రెండు వందలు నమ్రతకి ఇచ్చింది.

"శుక్రవారం తప్పకుండా ఇవ్వు. కాలేజీ ఫీజు కట్టాలి ఇంకా." హెచ్చరించింది.

"ష్యూర్ అండ్ థాంక్స్."

శుక్రవారం వచ్చేసింది. నమ్రత దగ్గర విలాసినికి తిరిగి ఇవ్వడానికి రెండు వందలు లేవు. ఆ రెండు వందలు అప్పుతీసుకుని ఈ సోమవారం నాడు చీర కొనుక్కోకుండా ఉండాల్సింది అని బాధపడలేదు నమ్రత.

యం. కాం. చదివే మంజూష దగ్గరకెళ్ళి అడిగింది.

"చూడవోయ్! నాకు అర్జెంట్‌గా ఓ రెండు వందలు కావాలి. నీ దగ్గర ఎప్పుడూ డబ్బుంటుందిగా. సోమవారం కల్లా నీ కిచ్చేస్తాను, ప్లీజ్."

మంజూషకి నమ్రత మీద సదభిప్రాయం ఉండటంతో రెండు వందలు నమ్రతకి అప్పుగా ఇచ్చింది. ఆ రెండు వందలని నమ్రత విలాసినికి ఇచ్చేసింది.

సోమవారం వచ్చింది. ఆ రోజు నమ్రత మంజూష దగ్గర తీసుకున్న రెండు వందలు తిరిగి ఇచ్చేసే రోజు.

మధ్యాహ్నం నమ్రత విలాసిని క్లాస్ కెళ్ళి ఆ అమ్మాయిని పక్కకి తీసుకెళ్ళి చెప్పింది.

"అర్జెంటుగా మళ్ళీ రెండు వందల రూపాయలు అవసరం అయ్యాయి. క్రితం సారి తీసుకున్నప్పుడు చెప్పినట్లు చెప్పిన సమయానికి ఇచ్చేశానుగా. ఈ సారి అలాగే ఇచ్చేస్తాను. శుక్రవారం సాయంత్రం కల్లా ఇచ్చేస్తాను. రెండు వందలు ఇవ్వవా?"

విలాసిని నమ్రతకి రెండు వందలు సందేహించకుండా ఇచ్చింది. ఆ రెండు వందలని నమ్రత మంజూషకి ఇచ్చేసింది. మళ్ళీ శుక్రవారం విలాసినికి రెండు వందలని మంజూష దగ్గర నించి తీసుకుని ఇచ్చింది. ఇలా కొన్ని వారాలు ఒకరి దగ్గర అప్పుతీసుకుని మరొకరికి బాకీ చెల్లిస్తూ గడుపుకొచ్చింది నమ్రత.

దాదాపు ఆరు నెలలు గడిచాయి. నమ్రతకి ఆ అప్పు దయ్యంలా కనిపించ సాగింది.

ఓ రోజు నమ్రత, విలాసిని, మంజూష ముగ్గురూ హాస్టల్లోని వాళ్ళ గదిలో కలవటం సంభవించింది.

నమ్రత ఇద్దరితో చెప్పింది. "ఇద్దరూ వినండి" విలాసినీ! ప్రతీ సోమవారం నీవు మంజూషకి రెండు వందల రూపాయలు ఇవ్వు. మంజూష! ప్రతీ శుక్రవారం నువ్వు విలాసినికి రెండు వందలు ఇవ్వు. సరేనా మీ ఇద్దరూ నాకో సహాయం చేయాలి. దయచేసి ఈ ఇచ్చిపుచ్చుకోవటంలో నన్నుమాత్రం వదిలేయండి."